నమస్తే తెలంగాణ
ములుగు జయశంకర్ భూపాలపల్లి
5 | వరంగల్, శనివారం 15 ఫిబ్రవరి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

జర్నలిస్టుల గొంతు నొక్కడం ప్రజాపాలనా?

- ఆర్‌జీ టీవీ విలేకరి రాజ్‌కుమార్‌ది అక్రమ అరెస్ట్
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హైదరాబాద్ సైబర్ క్రైం కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న దయాకర్‌రావు

దేవరుప్పుల, ఫిబ్రవరి 14: ప్రజాప్రభుత్వం, ప్రజాపాలన అని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం జర్నలిస్టుల గొంతునొక్కి, వారిపై ఉక్కుపాదం మోపాలని చూడడం ప్రజాపాలన అవుతుందా? అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని క్రైమ్ బ్రాంచ్ పోలీసులు ఆర్‌జీ టీవీ జర్నలిస్ట్ రాజ్‌కుమార్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ విషయం తెలిసిన వెంటనే ఆయన నేరుగా సైబర్ క్రైమ్ ఆఫీసుకు వెళ్లి డీసీపీతో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడారు. రాజ్‌కుమార్‌కు ధైర్యం చెప్పి బీఆర్ఎస్ అండగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్‌కుమార్‌పై గతంలో అక్రమ కేసులు పెట్టి 14 రోజులు జైలు పాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, అతడిపై మరోమారు ఉక్కుపాదం మోపాలని చూస్తున్నదని మండిపడ్డారు. కొడంగల్ ప్రజల ఆవేదనను తన యూట్యూబ్ చానల్ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం అతను చేసిన తప్పా అని ప్రశ్నించారు. 'మీకు చేతనైతే జర్నలిస్టులు వెలికితీస్తున్న ప్రజాసమస్యలను పరిష్కరించి ప్రజాప్రభుత్వంగా గుర్తింపు పొందండి... కానీ ఇలా అక్రమ కేసులు పెట్టి నియంత పాలనను తలపించేలా చేయకండి'.. అని ఎర్రబెల్లి హితవు పలికారు. రాజ్‌కుమార్‌పై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని, అతడిని వదిలిపెట్టాలని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు.

రైతులకు నీళ్లివ్వకపోతే ఆందోళన తప్పదు

- రిజర్వాయర్లు నింపి సాగునీరు విడుదల చేయాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరిక

జనగామ, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : నియోజకవర్గంలోని రిజర్వాయర్లను నింపి పంటలకు సకాలంలో నీటిని విడుదల చేయకుంటే రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం విడుదలైన ఒక ప్రకటనలో రైతులకు నష్టం కలిగించే ఏ చర్యలను ప్రభుత్వం తీసుకున్నా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా గండిరామారం, బొమ్మకూరు, కన్నెబోయినగూడెం, వెల్దండ, లద్నూర్, తపాస్‌పల్లి.. జనగామ నియోజకవర్గంలోని ఆయకట్టు ప్రాంతానికి సాగునీరు ఇవ్వాల్సిన రాష్ట్ర ప్రభుత్వం సీజన్ ప్రారంభమై, నాట్లు ముగింపు దశకు వచ్చినా అధికారులకు, ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. ప్రతిరోజూ రైతులు తనకు సమస్యలు చెబుతుంటే పైస్థాయి నుంచి కింది స్థాయి వరకు ఇరిగేషన్ కార్యదర్శి సహా ఈఎన్‌సీ, సీఈ, ఎస్ఈ, డీఈ, ఏఈల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, దేవాదుల అన్ని పంపులను బంద్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గ రైతుల విజ్ఞప్తి మేరకు అధికారులకు, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా వెంటనే అన్ని పంపులను, మోటర్లను ఆన్ చేసి రిజర్వాయర్లు, చెరువులను నింపి పంటలను కాపాడాలని కోరారు. రిజర్వాయర్లు, చెరువులు నింపకపోతే రైతులతో కలిసి పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు.


సేవాలాల్ గుడిలోకి వెళ్లకుండా మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను గేటు ఎదుట అడ్డుకున్న పోలీసులు

కాంగ్రెస్‌ది గూండా రాజకీయం

- కేసీఆర్ పాలనలో సంబురంగా సేవాలాల్ జయంతి
- పోలీసుల అత్యుత్సాహంతో ఘర్షణ
- మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 : గత పది సంవత్సరాలు కేసీఆర్ పాలనలో శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని గిరిజన సంఘాల నాయకులతో కలిసి సంబురంగా నిర్వహించామని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం సమీపంలో సేవాలాల్ గుడి వద్ద ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అసమర్థ పాలనను కొనసాగిస్తున్నదని అన్నారు. అనంతారం గుడి పక్కన తనకు సొంతస్థలం ఉందని, అందులో ఇల్లు నిర్మించుకొని ఉంటున్నానని తెలిపారు. తమ ఇంట్లో తాముంటే పోలీసులు అత్యుత్సాహంతో ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్నట్లు చెప్పారు. తనను ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. గతంలో ఎప్పుడూ ఇంతమంది పోలీసులతో సేవాలాల్ జయంతిని చేయలేదని, ఇప్పుడు జిల్లాలోని పోలీసులందరూ మోహరించారని పేర్కొన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే మురళీనాయక్ కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొట్టి పంపారని, గుడి పక్కన ఉన్న ఇంట్లో తాళం పగులగొట్టి వస్తువులను ధ్వంసం చేశారని, దాంతోనే వివాదం వచ్చినట్లు తెలిపారు. సేవాలాల్ గుడి పక్కన అంతా పట్టా భూమి అని, హైకోర్టు సైతం భూమి తనదేనని స్టే ఆర్డర్ కూడా ఇచ్చినా ఎమ్మెల్యే మురళీనాయక్ కావాలనే పార్టీ నాయకులతో ఘర్షణ చేస్తూ పోలీస్ ఫోర్స్‌ను పెట్టించారన్నారు. పోలీసులు సైతం గూండాగిరి చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి మద్దతు చేస్తూ అన్ని ఆధారాలు ఉన్న మమ్మల్ని లోపలకు పోకుండా గేటు ముందే ఉంచారని, పోలీసులు చేస్తున్న ఓవరాక్షన్‌ను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతి రావు, టౌన్ సీఐ దేవేందర్, రూరల్ సీఐ సర్వయ్య, రవి కుమార్, ఎస్సైలు, దీపిక, శివ కుమార్, తిరుపతి, వెంకన్న, మురళీధర్, సతీశ్, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ

కాగా, అంతకుముందు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న గుడి స్థలం వద్ద వివాదం చోటుచేసుకున్నది. బోగ్ భండారో నిర్వహించేందుకు మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సతీమణి సీతామహాలక్ష్మి అనంతారం వద్ద ఉన్న సేవాలాల్ గుడి వద్దకు వచ్చారు. భారీ బందోబస్తుతో ఉన్న పోలీసులు శంకర్‌నాయక్‌ను లోపలకు పంపకుండా గేటు వద్దనే ఉంచారు. దీంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టి సర్ది చెప్పి పంపించారు.

సీబీఐతో విచారణ జరిపించాలి..

- సీసీఐ పత్తి కొనుగోళ్లలో భారీ స్కామ్
- సుమారు రూ.వెయ్యి కోట్ల అవినీతి
- రైతులను కాంగ్రెస్ నిలువు దోపిడీ చేస్తున్నది..
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి14 : సీసీఐ పత్తి కొనుగోళ్లలో అక్రమాలపై వెంటనే సీబీఐతో విచారణ జరిపించాలని, ఇది భారీ స్కామ్ అని, సుమారు రూ.వెయ్యి కోట్ల అవినీతి జరిగిందని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నర్సంపేట పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువు దోపిడీ చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీసీఐ, వ్యవసాయశాఖ మధ్య దళారులు, పెట్టుబడి దారులు, మార్కెట్ అధికారులు కుమ్మక్కై కొనుగోళ్ల విషయంలో పత్తి రైతులకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. క్వింటాలు పత్తికి రూ.7,521 మద్దతు ధర రావాల్సి ఉండగా, ప్రైవేటు వ్యాపారులు కేవలం రూ.5వేలు, రూ.6వేలు మాత్రమే చెల్లించడంతో రైతులు కుదేలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు వ్యవసాయ మార్కెట్ల కార్యదర్శలను ఇటీవల సస్పెండ్ చేయడమే ఇందుకు నిదర్శనమని మండిపడ్డారు. రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్లలో ఈ కుంభకోణం జరిగిందన్నారు. మార్కెట్ కార్యదర్శులు, మధ్యవర్తులు సీసీఐ అధికారులతో కలిసి రైతులను మోసం చేశారని అన్నారు. క్వింటాల్‌కు రూ.2వేల దోపిడీ జరిగిందని, 5 లక్షల టన్నుల పత్తి కొనుగోళ్లలో అవినీతి జరిగినట్లు ఆధారాలు బయటకొచ్చాయని చెప్పారు. 8.42 లక్షల మంది రైతుల నుంచి రూ.14,921 కోట్ల విలువైన 20.15 లక్షల టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసిందన్నారు. అందులో అధికారికంగా ప్రైవేటు వ్యాపారులు విక్రయించింది 3.16 లక్షల టన్నులు కాగా, అనధికారికంగా జనవరి చివరి వరకు సుమారు 8లక్షల టన్నుల పంటను రైతుల నుంచి కొనుగోలు చేశారని పెద్ది అన్నారు. ఇందులో 5 లక్షల టన్నుల వరకు రైతుల నుంచి తక్కువ ధరకు కొని అక్రమంగా టీఆర్‌లు పొందడం ద్వారా సీసీఐకి మద్దతు ధరకు అమ్మినట్లు తెలిసిందని వివరించారు. ఇంతపెద్ద కుంభకోణం వెనకాల పెద్దల హస్తం లేకపోలేదన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో మార్కెట్‌లో ఏనాడూ ఎలాంటి ఆరోపణలు రాలేదని స్పష్టం చేశారు. నిత్యం సమీక్షలు, సమావేశాలతో మార్కెటింగ్ వ్యవస్థ అద్భుతంగా పనిచేసిందన్నారు. కాంగ్రెస్ రాగానే ఈ రకమైన కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రికి, వ్యవసాయశాఖ మంత్రికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. పత్తి కొనుగోళ్లలో అక్రమాలపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని, సంబంధిత అధికారికి రాత పూర్వక ఫిర్యాదు అందజేస్తామని పెద్ది స్పష్టం చేశారు.

బై నంబర్లుంటే బందేనా?

చాలాచోట్ల సర్వే నంబర్లలో బై నంబర్లు ఉన్న వారికి రైతుభరోసా అందడం లేదు. రెండు, మూడు సర్వేనంబర్లలో ఉంటే ఒకటి, రెండు సర్వే నంబర్లకే జమ అవుతున్నట్లు రైతులు గుర్తించారు. నర్సింహులపేట మండలంలో బై నంబర్లకు రైతుభరోసా రాలేదని రైతులు అడిగితే 'మాకు తెలువదు? మీ నంబర్లు రెవెన్యూ అధికారులు హోల్డులో పెట్టారు?' అని ఏవో.. 'మాకు సంబంధం లేదు? మేము పైసలు ఇచ్చేవాళ్లం కాదు? కలెక్టర్‌కు ఫిర్యాదు చేయండి' అని తహసీల్దార్ దాటవేయడంపై రైతులు భగ్గుమంటున్నారు. అలాగే ఖానాపురం మండలం ఐనపల్లికి చెందిన రైతు సురేశ్‌కు గ్రామ శివారులో 1.15 గుంటల భూమి 3 సర్వే నంబర్లలో ఉంది. ఈ రైతుకు రూ.8250 జమ కావాల్సి ఉంది. కానీ కేవలం ఒక్క సర్వేనంబర్‌కే రూ.4,950 జమ అయ్యాయి. అలాగే అదే గ్రామంలో మరో రైతు భిక్షపతికి 1.20 భూమికి గాను రూ.9వేలు జమకావాల్సి ఉండగా కేవలం ఎకరం భూమికి రూ.6వేలు మాత్రమే పడ్డాయి. ఇలా ఎంతోమంది రైతులకు అసంపూర్తిగా రైతుభరోసా నిధులు జమ అవుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.17,500 బాకీ ఉండగా కేవలం రూ.6వేలు మాత్రమే జమచేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నదని అందులోనూ కోతలు పెడతారా అని బాధిత రైతులు శాపనార్థాలు పెడుతున్నారు.

పెట్టుబడి సాయం అందక రైతుల అవస్థలు

- ఉమ్మడి జిల్లా అంతటా ఇదే గందరగోళం
- కార్యాలయాలకు అన్నదాతల పరుగులు
- మాకేం తెలియదంటున్న అధికారులు
- అయోమయంలో బాధితులు
- కేసీఆర్ పాలనలో తంచన్‌గా వచ్చేవి
- గుర్తుచేసుకుంటున్న అన్నదాతలు

అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్క హామీనీ సక్రమంగా అమలుచేయని రేవంత్ సర్కారు.. రైతుభరోసా విషయంలోనూ అదే తీరుగా వ్యవహరిస్తున్నది. ఇప్పటికే ఆలస్యంగా పెట్టుబడి సాయం పంపిణీ మొదలుకాగా అందులోనూ కోతలు విధించడం, మరికొందరికి అసలే జమచేయకుండా మోసం చేస్తున్నది. గతం కంటే ఎక్కువ(రూ.7500) ఇస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పుడు కనీసం రూ.6 వేలు కూడా సరిగ్గా ఇవ్వకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన, ఆగ్రహం పెల్లుబుకుతున్నది. దేవరుప్పల మండలం రాంచంద్రాపురం గ్రామానికి చెందిన పేరువరి భిక్షపతికి 1.35 ఎకరాల భూముండగా అతడి ఖాతాలో రూ.5,250 జమకావాల్సి ఉంది. అయితే రూ. 2,100 పడినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అలాగే హనుమకొండ జిల్లా నడికూడ మండలం నర్సక్కపల్లికి చెందిన వరికెల కిషన్‌రావుకు 2.26 ఎకరాల భూముండగా, ఆయనకు కేవలం 6 గుంటలకు రూ. 900 మాత్రమే ఖాతాలో జమయ్యాయి. ఇలా ఉన్న భూమికి, జమవుతున్న డబ్బులకు పొంతన లేకపోవడంతో ఉమ్మడి జిల్లా అంతటా ఇదే గందరగోళం నెలకొంది. దీంతో ఫోన్లకు వచ్చిన మెసేజ్‌లను చూపించేందుకు వ్యవసాయ శాఖ కార్యాలయాలకు, బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. అక్కడ అధికారులు సైతం తమకే తెలియదంటూ దాటవేయడంతో ఏం చేయాలో అర్థంగాక దిగాలు చెందుతున్నారు.

- పరకాల/దేవరుప్పల/ఖానాపురం/పెద్దవంగర/ నర్సింహులపేట, ఫిబ్రవరి 14

భరోసాలో కోతలు రైతుల దిగాలు

కొందరికి సగం డబ్బులే జమ.. మరికొందరికి అసలే లేదు..



రైతు భిక్షపతికి రూ. 11,250కు బదులు రూ. 2100 పడినట్లు వచ్చిన సెల్‌ఫోన్ మెసేజ్

రైతు భరోసా కింద ఎకరాకు రూ.7500 ఇస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తలేదు. ఎట్టకేలకు 14 నెలల తర్వాత ఎకరాకు రూ.6వేలే ఇస్తామని రైతుల ఖాతాల్లో జమచేస్తామని ప్రకటించి మరో మోసానికి తెరలేపారు. ఇప్పుడు అందులో కోతలు విధిస్తున్నారు. ప్రస్తుతం 2 ఎకరాల నుంచి 3 ఎకరాల్లోపు రైతులకు రైతు భరోసా నిధులను సర్కారు జమచేస్తున్నప్పటికీ చాలామంది రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం జమకాకపోగా, మరికొందరికి భారీ కోతలు పెడుతున్నారు. ఉదాహరణకు 3 ఎకరాలు కలిగిన రైతుకు రూ.18వేలు జమకావాల్సి ఉన్నప్పటికీ రూ.10 నుంచి రూ.12వేలకు మించి జమ కావడంలేదు. ఎకరాకు రూ.4 నుంచి రూ.5వేలకు లోపే జమ అవుతున్నాయి. ఇలా ఎకరం నుంచి 3 ఎకరాలు కలిగిన రైతులందరికీ అన్యాయం జరుగుతున్నది.

1.25 ఎకరాలకు రూ.2,250 పడ్డయ్..

నాకు 1.25 ఎకరాల భూమి ఉంది. కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం పెట్టుబడి సాయం అందిస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో రైతు భరోసా రూ.2,250 వచ్చింది. మా కుటుంబ సభ్యులకు సైతం అలానే డబ్బులు పడ్డయి. వ్యవసాయ అధికారులను అడిగితే ఏమి తెల్వదంటున్నరు. వ్యవసాయానికి యోగ్యంకాని భూమి కూడా లేదని, మొత్తానికి పడాలె కానీ ఎందుకు రాలేదో సమాచారం లేదంటున్నరు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని విధాలా నష్టమే.

– వేముల లక్ష్మణ్, ఉప్పరగూడెం గ్రామం, పెద్దవంగర మండలం

రైతుల గోస తాకుతది

నాకు రెండెకరాల 16 గుంటల భూమి ఉంటే 11 గుంటలకు రూ.1650 పడ్డయ్. ఇదేందని ఏవోను అడిగితే మాకు తెలువదంటున్నడు. రుణమాఫీ కాలే. నెల రోజులు ఎండబోసి వడ్లు అమ్మితే బోనస్ రాలేదు. సీఎం రేవంత్ చెప్పేదొకటి.. చేసేదొకటి.. రైతులను నిండా ముంచుతున్నాడు. రైతులను పట్టించుకునే వారు లేరు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు బ్యాంకోల్లు పిలిచి పైసలు ఇచ్చినరు. కాంగ్రెసోళ్లు గెలిచినకాన్నుంచి రైతులను గోస పుచ్చుకుంటున్నారు. మా రైతులను గిట్ల గోస పెడితే ఎట్లా.

– చిమ్ముల యాకమ్మ, మహిళా రైతు, పడమటిగూడెం, నర్సింహులపేట

అధికారులకు రైతుల ఫోన్లు

రైతుభరోసాలో భారీగా కోతలు పెట్టడంపై రైతులు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయధికారులకు ఫోన్లు చేసి కారణాల కోసం ఆరా తీస్తే తమకే తెలియదంటూ సమాధానమిస్తున్నారు. ఇదే విషయమై ఏవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా మండలం నుంచి నిత్యం వందలాది మంది రైతులు రైతుభరోసా పడలేదని తమకు ఫోన్లు చేస్తున్నారని పూర్తి వివరాలను ప్రభుత్వానికి పంపించామని చెబుతున్నారు. తక్కువగా జమకావడంపై తమకేం సమాచారం లేదని రైతులు గ్రహించాలన్నారు.

రైతువేదికలో ఏవోతో గొడవ చేస్తున్న రైతులు

కేసీఆర్ పాలనే బాగుండే..

కేసీఆర్ పాలనలోనే రైతులు సంతోషంగా ఉన్నరు. రైతుబంధు ప్రారంభించిన తర్వాత ఏడాదికి రెండు సార్లు రైతుల ఖాతాల్లో జమయ్యేవి. దీంతో రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగును ప్రారంభించేవారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వానకాలం పంటకు రైతు భరోసా ఎగ్గొట్టింది. ఇప్పుడు సగం పంటకాలం పూర్తయిన తర్వాత అరకొరగా రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది. ప్రభుత్వం వద్ద పూర్తి స్థాయిలో భూమి వివరాలున్నా ఎందుకు తక్కువగా డబ్బులు వేస్తున్నారో తెల్వడం లేదు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారే తన వద్ద పూర్తి స్థాయి సమాచారం లేదంటే ఇంకెవల దగ్గర ఉంటది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లా పాత రోజులు గుర్తుకు వస్తున్నయ్. కేసీఆర్ పాలనే బాగుండేది.

– వరికెల కిషన్‌రావు, నర్సక్కపల్లి, నడికూడ మండలం

కేయూ పద్మాక్షి గర్ల్స్ హాస్టల్‌లో ఆలు కర్రీ, సాంబార్‌లో వచ్చిన పురుగులు

కేయూలో కర్రీలో పురుగులు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 14 : కేయూలోని పద్మాక్షి గర్ల్స్ హాస్టల్‌లో భోజనంలో పురుగులు వచ్చాయి. శుక్రవారం రాత్రి భోజనం చేస్తున్న విద్యార్థినులకు ఆలు కర్రీ, సాంబార్‌లో పురుగులు కనిపించడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ డైరెక్టర్, అధికారులు పట్టించుకోకపోవడంతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మూడు రోజుల క్రితం బాయ్స్ కామన్ మెస్‌లో నాణ్యమైన ఆహారాన్ని అందించడం లేదని ఆందోళన చేశారు. వారం క్రితం ఇదే మెస్‌లో సీనియర్లు, జూనియర్లు కొట్టుకున్నారు. శుక్రవారం ఉదయం టిఫిన్స్ కోసం విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. వరుస ఘటనల నేపథ్యంలో యూనివర్సిటీలోని మెస్‌లు పోలీసు బందోబస్తు మధ్య నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి కర్రీ, సాంబార్‌లో పురుగులు రావడం, మహిళా పోలీసులు బందోబస్తు ఉండడంతో విద్యార్థినులు సైలెంట్‌గా ఉండిపోయారు.

భక్తజన మేడారం మేడారం మినీ జాతరలో మూడో రోజైన శుక్రవారం తెలంగాణ సహా పలు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు ఎత్తుబంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకొని కుటుంబంతో సరదాగా గడిపారు.

– తాడ్వాయి, ఫిబ్రవరి 14

ఇంత అలసత్వమా?

మహిళా కార్మికుల సమస్యలను తెలుసుకుంటున్న నీఅండ్ఎండీ బలరాం

- చిన్న చిన్న సమస్యలు పరిష్కరించలేరా?
- పక్కనే గోదావరి ఉన్నా ఇసుక కొరత ఎందుకు?
- కేటీపీపీ యాష్ తెచ్చుకోవడానికి ముహూర్తం కావాలా?
- అధికారులపై సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఫైర్
- భూపాలపల్లి ఏరియా గనుల్లో బలరాంనాయక్ పర్యటన

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ)/భూపాలపల్లి రూరల్/గణపురం: 'గనుల్లో చిన్నచిన్న సమస్యలు పరిష్కరించలేరా?.. ఇంత అలసత్వమా?'అని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాంనాయక్ అధికారుల తీరుపై మండిపడ్డారు. శుక్రవారం ఆయన భూపాలపల్లి ఏరియాలోని బొగ్గు గనుల్లో పర్యటించారు. కేటీకే 5 ఇంక్లైన్ గనిని పరిశీలించారు. అదేవిధంగా గణపురం మండలంలోని కేటీకే ఓసీ-3, 8 ఇంక్లైన్ గనులను తనిఖీ చేశారు. అనంతరం అధికారులు, కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బలరాం నాయక్ మాట్లాడుతూ ఇక్కడి సమస్యలు తనకు ఎవరూ చెప్పలేదని, ఇవి జీఎం స్థాయిలోనే పరిష్కరించుకోవచ్చన్నారు. తనకు చెప్తే నిధులకు అప్రూవల్ ఇస్తానని అన్నారు. సాండ్ స్టోవింగ్‌కు 1000 క్యూబిక్ మీటర్ల ఇసుక కావాలంటున్నారు.. పక్కనే గోదావరిని పెట్టుకొని ఇసుక కొరత అంటే ఇది ముమ్మాటికీ అధికారుల పొరపాటేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే బాటం యాష్ గురించి కేటీపీపీ ఉన్నతాధికారులతో మాట్లాడానని, మీరు ట్రాన్స్‌పోర్టింగ్, యాడ్ ఏర్పాట్లు చేశారా అని ప్రశ్నించగా అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో 'మీతో చాలా మాట్లాడాలి.. ఇక్కడ కాదు' అని ఫైర్ అయ్యారు. సింగరేణి వైద్యశాలల్లో డాక్టర్లు రిసెప్షనిస్టులుగా మారారని, కనీసం రోగుల చేయికూడా పట్టుకోవడం లేదని, వైద్యం కోసం ఏటా రూ. 500 కోట్లు ఖర్చు పెడుతున్నామని, ఇందులో నుంచి రూ. 100 కోట్లు ఖర్చు పెట్టినా అపోలో, కిమ్స్ లాంటి హాస్పిటల్‌ను హైదరాబాద్‌లో మనమే ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఒక ఆర్మీ డాక్టర్‌ను నియమించుకొని సింగరేణి హాస్పిటల్స్ అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలను అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సింగరేణిలో కార్మికుల గ్రేడ్జాలు శాతం పెరిగిపోతుంటే, మళ్లీ డిస్మిస్డ్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలనే డిమాండ్ వస్తుందని, వారికి బదులుగా డైరెక్టు రిక్రూట్‌మెంట్ పెట్టి కొత్త వాళ్లకి ఇస్తే బాగుంటుందన్నారు. భూపాలపల్లి ఏరియా గనులు ఏటా రూ.500 కోట్ల నష్టాల్లో కొనసాగుతున్నాయని, లోపాలను సరిదిద్దుకుంటే నష్టాలను అధిగమించవచ్చన్నారు. యంత్రాల వినియోగాన్ని పెంచి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని చెప్పారు. అధికారులు విధుల్లో అలసత్వాన్ని వీడి చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. సింగరేణిలో మహిళా కార్మికులు పెరిగిపోతున్నారని, బదిలీ ఫిల్లర్ నుంచి అధికారి స్థాయి వరకు వాళ్లు అన్ని డ్యూటీలు చేస్తున్నారని, అమ్మాయిలతో సంస్థకు కొత్త కళ వచ్చిందన్నారు. అనంతరం సీఎండీ నందనవనాన్ని ప్రారంభించి, మొక్క నాటారు. సమావేశంలో డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, కార్పొరేట్ జీఎం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.